క్లుప్తంగా

నష్టపరిహారం చెల్లించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రాపిడో బైక్ డ్రైవర్ నవీన్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.5లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.విక్రమ్, ఉపేందర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రీన్ ల్యాండ్ వైట్ హౌస్ వద్ద లారీ ఢీకొని మృతిచెందన బైక్ రాపిడో డ్రైవర్ ముండగల్ నవీన్ అంత్యక్రియలు ఖమ్మంలో జరగగా.. ఆయన పార్థివ కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. గిగ్ వర్కర్ల కింద అందజేసే రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తిరుపతిరావు, సుదర్శన్, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి అండగా ఉంటాం

ఖమ్మంగాంధీచౌక్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను జిల్లా అఖిల భారత యాదవ మహాసభ నాయకుల బృందం సోమవారం హైదరాబాద్‌లో కలిసి అభినందనలు తెలిపింది. సంఘం గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చిత్తూరు సింహాద్రి, నాయకులు కలిసి నవీన్‌యాదవ్‌కు అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేతుల నాగేశ్వరరావు, మొరిమేకల కోటయ్య, తుప్పాతి రవి, రాజుయాదవ్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌బీజీఎన్ఆర్‌లో సమావేశం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యాన అవకలన సమీకరణ – వాటి అనువర్తనాలు అనే అంశంపై విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌గా మహబూబాబాద్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత అధ్యాపకుడు సాంబశివరావు వ్యవహరించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వాజ్‌పేయి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఖమ్మం జిల్లా అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దుద్దుకూరి వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం మయూరిసెంటర్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించాక జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మందడపు ప్రభాకర్‌రెడ్డి, రాజయ్య, గోపయ్య, గెంటల విద్యాసాగర్, కాటేపల్లి లక్ష్మీనారాయణ, హర్కర లలిత, మోత్కూరు నారాయణరావు, రామకృష్ణారెడ్డి, యలమంచిలి మధు, జైపాల్ రెడ్డి, సురేష్, అశోక్, బాలాజీ, వంశీ, నాయుడు రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

నేలకొండపల్లి: దిమ్మె కూల్చిన ఘటనలో ముగ్గురుపై కేసు నమోదైంది. మండలంలోని పైనంపల్లిలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలక దిమ్మెను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన విషయం విదితమే. అయితే ఈ ఘటనపై స్థానికులు పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వగా ఆయన అక్కడకు చేరుకుని పరిశీలించి విచారణ అనంతరం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు విచారణ చేపట్టి ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

➡ వ్యక్తి అదృశ్యంపై ..

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖమ్మం అర్బన్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యంపై సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం చర్చి కాంపౌండ్ ప్రాంతానికి చెందిన గుంజి సురేష్ ధంసలాపురంలోని ఒక గోదాంలో పనికి వెళ్లాడు. ఆతర్వాత మధ్యాహ్నం నుంచి కనిపించకపోవడంతో ఆయన భార్య విజయ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఓజీ
వినోద	శశివదనే, కాంతార, కిష్కింధపురి
సాయిరాం	అరి , కానిస్టేబుల్
ఆదిత్య	కాంతార, మిరాయ్
శ్రీనివాస	ట్రోన్, మిరాయ్

- ఖమ్మంగాంధీచౌక్

ఓటు... ప్రతీ పౌరుడి హక్కు

'ఓట్ చోరీ' నిరసన ర్యాలీలో మంత్రి తుమ్మల



ర్యాలీలో అభివాదం చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: కేంద్రప్రభుత్వం పాల్పడుతున్న ఓట్ల చోరీపై అందరూ నిరసన తెలపాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. కేంద్రం తీరుతో పౌరులు ఓటు వేసే హక్కు కోల్పోవద్దనే భావనతో కాంగ్రెస్ ఆందోళనలు చేపడుతోందని తెలిపారు. కేంద్రప్రభుత్వం తీరును నిరసిస్తూ సంతకాలు చేపట్టగా, ఆ పత్రాలను ఖమ్మంలోని క్యాంపు కార్యాలయం నుంచి కాంగ్రెస్ జిల్లా కార్యాలయం వరకు సోమవారం ర్యాలీగా తీసుకెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొని మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ పిలుపుతో దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు. సంతకాల సేకరణలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పి.నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, మార్కెట్, ఆత్మకమిటీ చైర్మన్లు యరగర్ల హన్మంతరావు, దిరిశాల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు, నాయకులు కమర్తపు మురళి, మలీదు వెంకటేశ్వర్లు, ఆళ్ల నిరోషాఅంజిరెడ్డి, శరత్, తుపాకుల యలగొండస్వామి, రావూరి సైదబాబు, తాతా రఘురాం, తుంపాల కృష్ణమోహన్, తిలక్, దీపక్ చౌదరి, వాంకుడోత్ దీపక్, మనోహర్, బాణాల లక్ష్మణ్, చెరుకూరి పూర్ణ, బండి వెంకన్న, నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఓట్ల చోరీ'తో బీజేపీ దొంగాట

ఖమ్మం మామిళ్లగూడెం: గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడిందని దొంగాట ఆడిందని ఓబీసీ సెల్ రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వడ్డెబోయిన నర్సింహారావు అన్నారు. సోమవారం ఖమ్మం 25వ డివిజన్‌లో ఆయన ఆధ్వర్యాన ఇంటింటికి వెళ్లి ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడగా.. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ తుమ్మూరు రామిరెడ్డి, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పూర్ణ, నాగిశెట్టి రాధాకృష్ణలతో పాటు బొడ్డు మధు, గార్ల వెంకన్న, గురుమూర్తి, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ గ్రీవెన్స్‌కు 39 ఫిర్యాదులు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

ఖమ్మంమయూరిసెంటర్: గత కొన్ని వారాలుగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రజల నుంచి ఫిర్యాదుల సంఖ్య తగ్గుతూ రాగా.. సోమవారం వాటి సంఖ్య భారీగా పెరిగింది. శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్యలపై కేఎంసీ గ్రీవెన్స్‌లో ప్రజలు ఫిర్యాదులు అందజేయగా.. కమిషనర్ అభిషేక్ అగస్త్య స్వీకరించారు. ఆయా విభాగాలకు సంబంధించి 39 ఫిర్యాదులు రావడంతో వాటిని కమిషనర్ పరిశీలించి సంబంధిత విభాగాల అధికారులకు అందించి వాటిని పరిష్కరించాలని సూచించారు. గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదుదారుడు మరోసారి కార్యాలయానికి రాకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కొన్ని ఫిర్యాదులు పరిశీలిస్తే..

- కాల్వొడ్డు మంచికంటినగర్ బోర్డు వద్ద గల వైన్స్ వలన ఇబ్బంది పడుతున్నామని, వాహనాలను అడ్డదిడ్డంగా ఆపుతున్నారని, ఇంటి గోడలపై యూరిన్ పోస్తున్నారని, వ్యర్థాలను ఇళ్ల పక్కనే పోస్తుండడంతో ఇబ్బందికరంగా ఉందని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ స్థానికులకు ఇబ్బందులు కలకుండా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్‌ను ఆదేశించారు.
- ఇళ్ల మధ్య సెల్ టవర్‌ను నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని 20వ డివిజన్ రామచంద్రయ్యనగర్ వాసులు కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. అలాగే తమ ప్రాంతంలో డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు ఖాళీ స్థలంలో చేరి దుర్గంధం వస్తుందని కొంతమంది మహిళలు కమిషనర్‌కు వివరించారు. స్పందించిన కమిషనర్ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్, అసిస్టెంట్ కమిషనర్ అధికారులకు సూచనలు చేశారు.
- మున్నేరు రిటైనింగ్ వాల్ కోసం దానవాయిగూడెంలో ఏర్పాటు చేసిన కంకర మిక్సర్ పరిశ్రమ ద్వారా, కంకర మిక్సర్ తరలించే సమయాన దుమ్ము విపరీతంగా లేచి అనారోగ్యాలపాలవుతున్నామని స్థానికులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్డుపై రోజుకు మూడుసార్లు నీళ్లు స్ప్రే చేయించి, దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సూచనలు చేశారు.
- ద్వారకానగర్‌కు చెందిన శోభారాణి తమకు మున్సిపల్ వాటర్ రావడం లేదని, ఇంటి పన్నులు చెల్లిస్తున్నామని, ఎన్నిసార్లు అధికారులకు తెలిపినా సమస్యను పరిష్కరించడం లేదని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్‌దే ఓట్ల చోరీ..

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఓట్ల చోరీని ప్రజలు గమనించాలని బీజేపీ నాయకుడు డాక్టర్ శీలం పాపారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మాయ చేసి ఓట్లు చోరీ చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. కేవలం ఓట్ బ్యాంకు రాజకీయాలు చేస్తూ అనునిత్యం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నది కాంగ్రెస్సేనని, ఓటు దొంగలు, దేశ ద్రోహులు వారేనన్నారు.

నేటి సమాచారం..

➡ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాలు

ఖమ్మంరూరల్/కూసుమంచి/నేలకొండపల్లి: జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష ఎంపికపై పార్టీ శ్రేణుల అభిప్రాయాలను మంగళవారం సేకరించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల నాయకుల సమావేశం రెడ్డిపల్లిలోని అమ్మ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10గంటలకు ఏర్పాటుచేశామని వెల్లడించారు. అలాగే, కూసుమంచిలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3గంటలకు కూసుమంచి, నేలకొండపల్లి మండలాల బ్లాక్ కాంగ్రెస్ నాయకుల సమావేశం ఏర్పాటుచేశామని తెలిపారు. ఆయా సమావేశాలకు నాయకులు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. కాగా, కూసుమంచిలో జరిగే అభిప్రాయ సేకరణకు నాయకులు హాజరుకావాలని నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ఓ ప్రకటనలో సూచించారు.

➡ విద్యుత్ వినియోగదారుల సదస్సు

కూసుమంచి: కూసుమంచిలోని ఏడీఈ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏడీఈ కోక్యా నాయక్ తెలిపారు. ఈ సదస్సులో విద్యుత్ పునరుద్ధరణ, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పడం, ఓల్టేజీ హెచ్చు తగ్గులు, మీటర్ల మార్పు తదితర సమస్యలపై ఫిర్యాదులు అందించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీలో చేరిక

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంకు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ కె.మారుతి గౌడ్ సోమవారం బీజేపీ చేరారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే, మరో 50 మందిని కూడా బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి వాసుదేవరావు, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు సన్నే ఉదయ్‌ప్రతాప్, రామలింగేశ్వరరావు, మండడపు సుబ్బారావు, ఆకుల నాగేశ్వరరావు, సురేష్, గోపి, రుద్రగాని మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో..

కామేపల్లి: మండలంలోని బాసిత్‌నగర్ గ్రామానికి చెందిన జక్కుల అప్పయ్య, రవి, బాబు, నవీన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సోమవారం వీరికి ఆ పార్టీ నాయకులు పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు, కామేపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ తీర్థాల చిదంబరరావు మాట్లాడుతూ.. హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామా మోహన్‌రెడ్డి, కాత్రాల రాంబాబు, నున్నావత్ సూర్య, గడ్డం వెంకన్న, వెంకటేశ్వర్లు, రామకోటి పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్‌పై అవగాహన

నేలకొండపల్లి: పత్తి పంటను విక్రయించుకునేలా స్లాట్ బుకింగ్ విధానంపై అవగాహన కల్పించనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.రాధ తెలిపారు. మండల కేంద్రంలో తన కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడారు. మంగళవారం ఉదయం 9 గంటలకు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించనుండగా.. పత్తి రైతులు స్థానిక రైతు వేదికలో హాజరు కావాలని కోరారు.

విద్యారంగంపై ప్రభుత్వం చిన్నచూపు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో విద్యా రంగంపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారుతున్నాయని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ విమర్శించారు. సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక, బీఏఎస్ బకాయిలు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు బీఏఎస్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులను పాఠశాలలకు అనుమతించబోమని చెబుతున్నా.. ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా వారిపై కపట ప్రేమను కనబరుస్తూ కాలం వెళ్లదీస్తుందన్నారు. వెంటనే బీఏఎస్ బకాయిలను చెల్లించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ నాగులమీరా, శివ, మనోజ్, గోపి, సాయి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గోళ్లపాడు కాల్వ పనులు పూర్తి చేయాలి



సర్వే చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: గోళ్లపాడు కాల్వ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ నాయకుడు షేక్.హిమామ్ డిమాండ్ చేశారు. సీపీఎం ఖమ్మం త్రీటౌన్ 30వ డివిజన్ కమిటీ ఆధ్వర్యాన స్థానిక సమస్యలపై సోమవారం సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కాల్వ కోసం ఇక్కడి నిర్వాసితులను ఖాళీ చేయించి అండర్ డ్రైనేజీల నిర్మాణాలను నేటికీ పూర్తిచేయలేదన్నారు. దీంతో వర్షాలు పడినప్పుడల్లా కాల్వ ఉప్పొంగి నీళ్లు ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం త్రీటౌన్ నాయకులు రంగు హనుమంతచారి, యర్రా నగేష్, పెద్దోజు ఉపేంద్ర చారి, సుగ్గల హనుమంతరావు, జంగం నగేష్, మద్ది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు.. అక్షరాభ్యాసాలు



అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ, తదితరులు



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న టీచర్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 9వ డివిజన్ రోటరీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అలాగే, గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అంతేకాక పోషకాలు అందే ఆహారం లభ్యతపై అవగాహన కల్పించారు. సీడీపీఓ బి.వీరభద్రమ్మ మాట్లాడగా కార్పొరేటర్ షేక్ జాన్‌బీనాగుల్‌మీరా, సూపర్‌వైజర్ ఎం.కోటేశ్వరి, బ్లాక్ కోఆర్డినేటర్ లలిత పాల్గొన్నారు.

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం 48వ డివిజన్ సారథినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందజేస్తున్న పోషకాలను అంగన్‌వాడీ టీచర్ వివరించారు. తృణ ధాన్యాలు, ఆకుకూరలు, కోడిగుడ్లు, కూరగాయలు, పండ్లతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యకమంలో అంగన్‌వాడీ టీచర్ భార్గవి, హెల్పర్ సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

10 రోజుల్లో మార్పు కనిపించాలి

పారిశుద్ధ్య పనుల తనిఖీలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



వాకింగ్ ట్రాక్‌లో కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: 10రోజుల్లో ఖమ్మాన్ని మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం తెల్లవారుజామున ఆయన మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి నగరంలో పర్యటించి, ప్రధాన రహదారులు, పార్కులు, మయూరిసెంటర్, వైరారోడ్, ప్రభుత్వ ఆస్పత్రి, ఇల్లెందు క్రాస్‌రోడ్ సెంటర్‌లలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేసి పారిశుద్ధ్యం పనులు ముమ్మరం చేయాలని చెత్త సేకరించే కార్మికులు, జవాన్‌లకు సూచించారు. బైపాస్ రోడ్, ఎన్టీఆర్ సర్కిల్, శ్రీశ్రీ రోడ్లలో రోడ్ల మరమ్మతులను పరిశీలించి, నాణ్యతను తనిఖీ చేశారు. ప్రత్యేక డ్రైవ్ రోజువారీ పారిశుద్ధ్య పనులకు దోహదంగా ఉండనుండగా.. పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని కలెక్టర్ సూచించారు. పది రోజుల పాటు నిర్వహించే పారిశుద్ధ్య పనులకు సంబంధించి చెత్త, మట్టితో ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసిన తర్వాత ముందు తేడాలను తెలియజేసేలా ఫొటోలు తీయాలని, ఎక్కడైనా అపరిశుభ్రంగా ఉన్నట్లు తెలిస్తే సంబంధిత జవాన్, ఇతర అధికారులపై చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. 15 రోజుల్లో ప్రధాన రహదారిపై ఎక్కడా గుంతలు కన్పించొద్దని, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై ఫీడ్ బ్యాక్ రిజిస్టర్ ఏర్పాటు చేసి పర్యవేక్షకులు రిజిస్టర్‌లో సంతకాలు చేయాలన్నారు. వీధి వ్యాపారులను వీధి వ్యాపారుల ప్రాంగణంలోనే తమ వ్యాపారాలు నిర్వహించుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, ఈఈ కృష్ణాలాల్, ఉద్యాన అధికారిణి బెల్లం రాధిక, శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య, డీఈ ధరణికుమార్, ఏఈలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి..

ఖమ్మం మామిళ్లగూడెం: భారతదేశ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీల ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో అంజయ్య, విజయ్, సామినేని భవాని, కూరపాటి సునీల్, ఇదయ్య, నరసింహారావు, ముత్తారావు, తోళ్ల వెంకన్న, తూరు గంటి రాము, బాకీ శ్రీను, మంద గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల జోలికొస్తే సహించేది లేదు



బుడగ జంగాలతో మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని అల్లీపురం కొత్తగూడెం 15వ డివిజన్ పరిధిలో బుడగ జంగాల సమాజానికి చెందిన నిరుపేదలు ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న స్థలాలను తిరుమల తిరుపతి దేవస్థానం పేరుతో ఖాళీ చేయమనడం అన్యాయమని సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ తీవ్రంగా విమర్శించారు. సోమవారం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్ ఆధ్వర్యాన బుడగ జంగాల నివాస ప్రాంతాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ధంసలాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 408లో బుడగ జంగాలు స్థలాలను కొనుగోలు చేసి నివాసముంటున్నారని, ప్రభుత్వం దేవాలయ నిర్మాణం కోసం వారి ఇళ్లను తొలగించే ప్రయత్నం చేస్తే పార్టీ తరఫున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నగర కార్యదర్శి షేక్ జానిమియా, కొత్తగూడెం శాఖ కార్యదర్శి జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, రాపోలు కొండలు, మేడ చిన్ని, ఆలకొండ శ్రీను, రాపోలు సారయ్య, గండికోట భిక్షం, పల్లపు నాగయ్య, రైతులు గోవర్ధన్, రవి, రాంబాబు, రాము, బాధితులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య



సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

తిరుమలాయపాలెం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై దాడి.. రాజ్యాంగంపై దాడి చేయడమేనని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గజ్జల వెంకటయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజేఐపై దాడికి పాల్పడిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో మతోన్మాద శక్తులు, ఆర్ఎస్ఎస్ వ్యక్తుల అరాచకాలు పెరిగిపోతున్నాయని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ అరాచకాలను ఖండించాలని, రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌డీ బషీరుద్దీన్, పార్టీ మండల కార్యదర్శి శ్రీను, మండల నాయకులు పద్మనాభుల సుధాకర్‌రావు, తుళ్లూరు నాగేశ్వరరావు, అంగిరేకుల నరసయ్య, బింగి రమేష్, దాసరి మహేందర్, వళపొంగు వీరన్న, స్వామి, బాలు, లింగస్వామి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు



ఆర్థిక సాయం అందిస్తున్న చైర్మన్ కృష్ణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ట్రంక్‌రోడ్డులో ఉన్న ఆర్జేసీ కళాశాల పూర్వ విద్యార్థి పోలం శ్రీనివాస్ ఇటీవల మరణించగా ఆయన కుటుంబసభ్యులకు కళాశాల పూర్వ విద్యార్థులు రూ.60వేలు సమకూర్చారు. అయితే ఆర్థిక సాయాన్ని ఎస్‌బీఐటీ, ఆర్జేసీ విద్యా సంస్థల చైర్మన్ గుండాల కృష్ణ సోమవారం అందించి తోటి విద్యార్థికి అండగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.లింగయ్య, పూర్వ విద్యార్థులు జగదీశ్, సూర్య, సంధ్య, శిరీష, లక్ష్మీనారాయణ, వెంకట్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.25వేల విరాళం



విరాళం అందిస్తున్న భక్తుడు

ఖమ్మంఅర్బన్: నగరంలోని యూపీహెచ్ కాలనీలోని స్వయంభూ శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొనసాగుతున్న అయ్యప్ప అన్నదాన కార్యక్రమానికి సోమవారం కవిరాజ్‌నగర్ చెందిన మీనుగు రాంబాబు, కృష్ణవేణి దంపతులు రూ.25,116 విరాళాన్ని ఆలయ కమిటీ బాధ్యులకు అందజేశారు. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కోమరయ్య, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

ట్రాఫిక్‌తో కుస్తీ..



నగరంలోని ఆర్టీఏ కార్యాలయం రోడ్డు నిత్యం రద్దీతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. బైపాస్ రోడ్డు నుంచి కేఎంసీ కార్యాలయానికి వెళ్లే దారిలోనే ఆర్టీఏ కార్యాలయం ఉండడంతో కార్యాలయానికి ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే భారీ వాహనాలతో నిత్యం రద్దీ ఏర్పడుతుంది. వాహనాలు ఎటూ కదలలేని పరిస్థితుల్లో ట్రాఫిక్ జామ్ అయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్